క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. స్నేహనగర్, రాఘవేంద్ర నగర్, ఎన్జీవోస్ కాలనీ రోడ్డు, శ్రీనగర్ కాలనీ వెస్ట్ అండ్ సౌత్ ప్రాంతాల్లో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, పరిమళ కాలనీ, ఆర్టీసీ కాలనీ, పోలీసు కాలనీ, పూరిగుట్ట, ఫిల్టర్‌బెడ్ రోడ్డులో మధ్యాహ్నం2 నుంచి సాయంత్రం 5గంటల వరకు, మచిలీబజార్, పద్మాక్షి రోడ్డు, బస్టాండ్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8నుంచి 11 గంటల వరకు, బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ, కాజీపేట మెయిన్ రోడ్డులో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

నేడు టీఎస్‌యూటీఎఫ్ జిల్లాస్థాయి సమావేశం

విద్యారణ్యపురి: తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) హనుమకొండ జిల్లాస్థాయి విస్తృత సమావేశాన్ని ఈనెల 4న ఉదయం హనుమకొండ హంటర్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదాశివరెడ్డి, పెండెం రాజు శనివారం తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగం విశ్లేషణ తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు సోమశేఖర్, మల్లారెడ్డి, రంజిత్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.

రేపటి ప్రజావాణి రద్దు

కరీమాబాద్ : వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనాపరమైన కారణాలతో ప్రజావాణి నిర్వహించడం లేదని, జిల్లా ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ కోరారు.

బలవంతంగా ఇంటి పన్ను వసూళ్లు తగదు

కాజీపేట: ప్రజల స్థితిగతులను పరిశీలించకుండా ఇంటి, నీటి పన్నుల వసూళ్లను బలవంతంగా చేపట్టడం మున్సిపల్ అధికారులు మానుకోవాలని పీఏసీఎస్ డైరెక్టర్, బీజేపీ నేత కాయిత రాజ్‌కుమార్ యాదవ్ సూచించారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో పన్నులు కట్టని వారి ఇంటి తలుపులను తొలగించడం, వస్తువులను అధికారులు జప్తు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పన్ను చెల్లింపుదారులకు సమయం ఇచ్చి వసూళ్లు చేసుకోవాలని కోరారు.

కార్మికులకు చీరల పంపిణీ



మామునూరు: ఓరుగల్లు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో శనివారం చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మచ్చిక రాజు మాట్లాడుతూ కార్మికుల శ్రమ, సేవలను గుర్తించి చీరలు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు చేయుతనందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్ బండి శ్రీధర్, కందిక స్వామి, పసునూరి శ్రీధర్, మధుకర్ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్ ఆవిష్కరణ

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని శంభునిపేట గణేష్‌నగర్‌లో ప్రతిష్ఠించనున్న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్‌ను వేద పండితులు, కమిటీ బాధ్యులు శనివారం ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా మార్చి 30వ తేదీన విశ్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, 31న గ్రామోత్సవం, యాగశాల ప్రవేశం, పంచసూక్త ఆవాహనం, స్థాపిత దేవతా హోమం, కుంకుమ పూజలు, పూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్ఠి, ఏప్రిల్ 1వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, దిష్టికుంభం, మంగళశాసనం నిర్వహించనున్నట్లు వేద పండితులు వివరించారు.

టీజేఎస్ చైర్మన్ కోదండరాంను కలిసిన రైల్వే జేఏసీ నేతలు

కాజీపేట రూరల్: హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో శనివారం జరిగిన విభజన హామీలు, కేంద్ర ప్రభుత్వ వివక్ష, దగాపడ్డ ఓరుగల్లు సదస్సులో పాల్గొన్న టీజేఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్, కన్వీనర్ కోండ్ర నర్సింగరావు, దేవులపల్లి రాఘవేందర్ బృందం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించింది. అనంతరం, కాజీపేట రైల్వే డివిజన్, కాజీపేట వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌ను రైల్వే కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్‌గా చేయాలని కోరినట్లు వారు తెలిపారు. రైల్వే జేఏసీ కోకన్వీనర్లు సుధాకర్ రావు, భాస్కర్, వైస్ చైర్మన్లు లక్ష్మీనారాయణ, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

కేఎంటీపీ పనులు వేగవంతం చేయాలి

- స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- భూములు ఇచ్చిన వారికి త్వరలో ఇళ్ల పట్టాలు
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ) లో అభివృద్ధి పనులతోపాటు పలు కంపెనీలు తమ యూనిట్లను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. టీఎస్ఐఐసీ అధికారులతో కలిసి కేఎంటీపీలోని గణేషా ఎకోటెక్ కంపెనీ, నిర్మాణంలో ఉన్న కైటెక్స్ కంపెనీలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, కంపెనీ ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. పార్కులో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పార్కు ఏర్పాటుకు భూమి పూజ చేసి ఏడేళ్లు అవుతున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఓయూ చేసుకున్న కంపెనీలు యూనిట్లను నెలకొల్పాలని సూచించారు. కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రస్తుతం కార్మికులతో 12 గంటలు పనిచేయిస్తున్నారని, 8 గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో పని చేయించుకోవాలన్నారు. పార్కు కోసం భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో వసతులు కల్పించాలని, వారికి ఇళ్ల పట్టాలు ఇస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎమ్మెల్యే పార్కులో కలియదిరిగి పనులు పరిశీలించారు. టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ రామా సంతోష్‌కుమార్, ఎంపీపీ భీమగాని సౌజన్య, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణశాఖకు పూర్వవైభవం తెస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

వరంగల్ : బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన గృహ నిర్మాణశాఖకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకొస్తుందని రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో మంత్రికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసినట్లు తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా కమిటీ నాయకులు దుర్గాప్రసాద్, భజరంగ్‌లాల్ తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు గృహ నిర్మాణ శాఖ అధికారులు పనిచేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రఘువీర్‌ప్రసాద్ గుప్తా, కుమార్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని అమ్మవారిపేట దామెరగుట్టల వద్ద జరగనున్న సమ్మక్క – సారలమ్మ జాతర వాల్‌పోస్టర్‌ను కుడా కార్యాలయంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, జాతర కమిటీ చైర్మన్ కోడూరి భిక్షపతి, ఆర్గనైజర్ దాసి రాందేవ్, ధర్మకర్తలు ఆవునూరి కుమారస్వామి, రాంమూర్తి, రవి, కుమారస్వామి, మాజీ కార్పొరేటర్లు కేడల పద్మ, బత్తిని వసుంధర, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, నాగరాజు, సునీత తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

హన్మకొండ: పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆచార్య లక్ష్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని స్పెక్ట్రా గ్లోబల్ స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు శనివారం జరిగాయి. 12 మండలాలకు చెందిన విద్యార్థులకు రాత పరీక్ష, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలకు ప్రాముఖ్యతనిచ్చి శాస్త్ర సాంకేతిక ఫలాలు సామాన్యుల దరిచేరేలా కృషి చేయాల్సిన అవసరముందని గుర్తు చేశారు. నిట్ ఆచార్యులు ఆంజనేయులు మాట్లాడుతూ సైన్స్ అనేది ఒక జీవన విధానమని, తామంతా సైన్స్ పద్ధతిలో జీవించాలని సూచించారు. అనంతరం బ్రోచర్ విడుదల చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ విశ్రాంత అధికారి కాజీపేట పురుషోత్తం, ఆచార్య కాశీనాథ్, ఆచార్య ఆంజనేయులు, ధర్మప్రకాష్, సుమలత, దయాకర్, వందన, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి రెడ్డి, జేవీవీ జిల్లా బాధ్యులు ఉమామహేశ్వర రావు, శ్రీనివాస్, సోమయ్య, భిక్షపతి, పలు మండలాల జేవీవీ బాధ్యులు, గైడ్ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అండగా ఉంటా..



స్వప్నను ఓదార్చుతున్న మంత్రి సురేఖ

హన్మకొండ: కారుణ్య నియామకాలు ఉత్తర్వులు అందిస్తున్న సమయంలో ఓ కారుణ్య నియామకురాలి దీనస్థితి విని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఉద్వేగానికి లోనయ్యారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో వరంగల్ రీజియన్‌లో ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కండక్టర్లుగా నియామక ఉత్తర్వులను మంత్రి అందించారు. ఈక్రమంలో హనుమకొండ పెద్దమ్మగడ్డకు చెందిన ఆర్.స్వప్నకు నియామక ఉత్తర్వులు అందిస్తుండగా ఆమె దయనీయ పరిస్థితిని మంత్రికి ఆర్టీసీ ఆర్ఎం జాస్తి శ్రీలత వివరించారు. మహాలక్ష్మి పథకంతో ఇప్పుడు ఆ అభాగ్యురాలికి ఉద్యోగం వచ్చిందని మంత్రికి వివరిస్తుండగా ఉత్తర్వులు అందుకున్న స్వప్న.. తన బాధను చెప్పుకుంటూ కంటతడి పెడుతూ ఒక్కసారిగా మంత్రి సురేఖను హత్తుకున్నారు. దీంతో మంత్రి సురేఖ ఉద్వేగానికి గురై ఆమె కుటుంబానికి అండగా ఉంటానని, పిల్లల చదువు కోసం చేయూతనందిస్తానని భరోసా ఇచ్చారు.

మానసిక దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

మామునూరు: టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ 'ఎ' కంపెనీ కానిస్టేబుళ్ల అన్యువల్ రిఫ్రెషర్ శిక్షణ ముగింపు సందర్భంగా హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రాన్ని వారు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేసి ఆశ్రమానికి నిత్యావసర సరుకులను అందజేసి తమ సేవాదృక్పథాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, ఆర్ఎస్సైలు శ్రీహరి, కార్తీక్, కంపెనీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఎంపీ స్థానానికి దరఖాస్తులు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు పలువురు కాంగ్రెస్ నాయకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈమేరకు తనకే అవకాశం కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. ఇన్‌చార్జ్ భాస్కర్‌కు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బోనగిరి ఆరోగ్యం తనయుడు రవీందర్, డాక్టర్ పిడమర్తి రవి తమ దరఖాస్తులను అందజేశారు.

బీజేపీ విజయమే లక్ష్యం

హన్మకొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డిని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మురళీధర్ గౌడ్, నాయకులు, రిటైర్డ్ ఉద్యోగుల విభాగం నాయకులు పులి సరోత్తంరెడ్డి, తిరువరంగం ప్రభాకర్ శనివారం కలిసి పులి సరోత్తంరెడ్డికి వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

బీఆర్ఎస్‌పై ప్రజలకు విసుగొచ్చింది



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా: నియంతృత్వ పోకడలతో రాచరిక తరహా పాలన సాగించిన బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు విసుగొచ్చిందని, సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజాదరణ రోజురోజుకు రెట్టింపు అవుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ 5వ డివిజన్‌లోని సుందరయ్యనగర్‌కు చెందిన పలువురు నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో చేరిన నాయకులకు నగరంలోని ప్రజాభవన్‌లో కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దీపక్‌రెడ్డి, సతీష్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణే ధ్యేయం



వరంగల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని 1నుంచి 19ఏళ్ల వయస్సుగల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి లక్ష్యాన్ని చేరుకోవాలని స్థానిక కార్పొరేటర్ మహ్మద్ ఫుర్కాన్ పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై 21వ డివిజన్ ఎల్‌బీనగర్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ సహాయక పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, అంగవాడీ వర్కర్లు.. 1నుంచి 19ఏళ్ల వయస్సుగల పిల్లల పేర్లను నమోదు చేసుకుని 12వ తేదీన ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసే కేంద్రంలో మాత్రలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, హెల్త్ సూపర్‌వైజర్ మసూద్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'స్పోకెన్ ఇంగ్లిష్'



పబ్లిక్ స్పీకింగ్‌పై బోధిస్తున్న నిపుణులు

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్) ద్వారా విద్యార్థులకు 'స్పోకెన్ ఇంగ్లిష్ – పర్సనాలిటీ డెవలప్‌మెంట్' తరగతులు జనవరి 22వ తేదీ నుంచి విజయవంతంగా కొనసాగుతున్నాయని సెల్ట్ సంచాలకులు డాక్టర్ ఆర్.మేఘనారావు తెలిపారు. ఇప్పటివరకు వివిధ అంశాలపై తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యంగా వాటిలో ఆంగ్ల భాషపై పట్టు సాధించటానికి మెలకువలు, ఇంటర్వ్యూలో పాటించాల్సిన నియమాలు వంటి పలు అంశాలపై సంబంధిత విభాగాల్లో నిష్ణాతులతో తరగతులు బోధిస్తున్నట్లు వివరించారు. ఈనెల 9వ తేదీ వరకు క్లాసులు కొనసాగుతాయని చెప్పారు. శనివారం జరిగిన శిక్షణ తరగతిలో 'పబ్లిక్ స్పీకింగ్' అంశంపై వీణారాజ్.. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారని తెలిపారు.

సంక్షిప్తంగా

కేయూ రిజిస్ట్రార్‌కు అభినందన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ మల్లారెడ్డిని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు డాక్టర్ వెంకటగోపీనాథ్, బాధ్యులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

హన్మకొండ కల్చరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశ్వబ్రాహ్మణ జాతీయులైన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యులు, స్థపతి డాక్టర్ వేలు ఆనందాచార్యకు పద్మశ్రీ అవార్డులు ప్రకటించడంపై రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

కాశిబుగ్గ: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) వరంగల్ మండల మహాసభ సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుద్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా బాదావత్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కుమారస్వామి, మహిళా ఉపాధ్యక్షురాలిగా శాంత, కోశాధికారిగా పొన్నం రవి, కార్యదర్శులుగా విజయ్, వంశీకృష్ణను ఎనుకున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు సుజన్‌ప్రసాదరావు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి: కుమ్మరి సంఘం క్యాలెండర్‌ను సుబేదారిలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్రారపు కుమారస్వామి, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంపత్ పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో డబ్బా తొలగింపు



వరంగల్: ఎలాంటి అనుమతి లేకుండా వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన డబ్బాను తొలగించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య తెలిపారు. మార్కెట్‌లో అనుమతి లేకుండా షాపు పెట్టుకునేందుకు ఐరన్ డబ్బాను పెట్టినట్లు తమకు సమాచారం అందడంతో కూరగాయల మార్కెట్‌కు శనివారం వెళ్లి పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. డబ్బాకు సంబంధించిన వ్యక్తులు రావాలని కోరినా ఎవరూ రాకపోవడంతో ఆ డబ్బాను స్వాధీనం చేసుకుని ఏనుమాములలోని మార్కెట్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రేడ్ –2 కార్యదర్శులు బియాబానీ, శ్రీరామోజు రాము, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దేశ చరిత్రను మార్చేది విద్యావంతులే..



ఓటరు నమోదు ఫారాన్ని అందజేస్తున్న వినోద్, భారతి



హసన్‌పర్తి: మాట్లాడుతున్న రజనీకుమార్

ఖిలా వరంగల్: దేశ చరిత్ర, రాజకీయాలను మార్చే శక్తి విద్యావంతులు, ఉపాధ్యాయులకే ఉంటుందని విద్యావేత్త కురుకుల భారతి, సామాజిక న్యాయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్ తెలిపారు. ఓటు హక్కు అనేది ఓ వజ్రాయుధం లాంటిదని, ఈనెల 6లోపు పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకుని విద్యావంతులను ఎన్నుకోవాలని వారు సూచించారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు విద్యానగర్ కాలనీలోని చాణిక్య విద్యానికేతన్ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం, పట్టభద్రులకు ఓటరు నమోదు ఫారాలను అందజేశారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

హసన్‌పర్తి: పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ కోరారు. దరఖాస్తుకు కేవలం మూడు రోజులే గడువు ఉందని చెప్పారు. హసన్‌పర్తి మండలం కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా ఓటరు నమోదుకు అవకాశం ఉందని వివరించారు. సమావేశంలో నాయకులు నద్దునూరి నాగరాజు, జక్కుల రమేష్, ఐలేశ్వర్, ప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో 'పేరెంట్స్ డే'



చిన్నారులతో నాన్నమ్మలు, అమ్మమ్మలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు. కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి.. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులతో పాటు తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మలను చిన్నారులు గౌరవించేందుకు, ఆదరించేందుకు ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమ నాన్నమ్మ, అమ్మమ్మలకు విద్యార్థులు తిలకం దిద్ది స్వాగతం పలికారు. చిన్నారులతో వారు మమేకమై ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో కేవీ ఉపాధ్యాయులు తౌటం శ్రీనివాస్, వెంకన్న అనబత్తుల లలిత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి కాపాడాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు నగర కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు శనివారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలంలో అనధికార కట్టడాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తప్పుడు కాగితాలు సృష్టించి స్థలం కబ్జా చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, అరూరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

'షైన్'లో విజ్ఞాన కళా మహోత్సవం



మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న మూగల కుమార్

హన్మకొండ: హనుమకొండ నయింనగర్‌లోని షైన్ స్కూల్‌లో శనివారం విజ్ఞాన, కళా మహోత్సవం వైభవంగా జరిగింది. వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని షైన్ విద్యా సంస్థల పాఠశాల బ్రాంచీలకు చెందిన విద్యార్థులు కళా మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎగ్జిబిట్లను ప్రదర్శించి ప్రతిభను చాటుకున్నారు. అదేవిధంగా సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమాన్ని షైన్ విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక నైపుణ్యాన్ని వెలికి తీయడానికి, కళలను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో షైన్ విద్యా సంస్థల డైరెక్టర్ రమ, ప్రధానోపాధ్యాయురాలు కవిత రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రపంచస్థాయికి ఎదగాలి



గ్యాబ్రియల్ స్కూల్ వేదిక వద్ద ప్రిన్సిపాల్ ఆంటోని, బాలథెరిసాతో వెన్నం శ్రీనివాస్, కోదండరాం

కాజీపేట రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి ప్రపంచస్థాయికి ఎదగాలని సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ పూర్వ విద్యార్థి, ఇండియన్ నేవీ అడ్మిరల్ వెన్నం శ్రీనివాస్ ఆకాంక్షించారు. కాజీపేట గ్యాబ్రియల్ స్కూల్ 68వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో, సాంకేతిక రంగంలో పట్టు సాధించి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. మహనీయులు గాంధీజీ, రవీంద్రనాథ్ ఠాగూర్, థామస్ అల్వా ఎడిసన్, సర్వేపల్లి రాధాకృష్ణన్, ఏపీజే.అబ్దుల్ కలాం జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. గ్యాబ్రియల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని పాలిశెట్టి ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవంలో ప్రొఫెసర్ కోదండరాం, సిస్టర్ బిజి జోసెఫ్, సిస్టర్ దీనామేరీ, ప్రొఫెసర్ రతీష్‌కుమార్, బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసా, డాక్టర్ ఆశిష్ చౌహాన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సంప్రదాయ దినోత్సవం



ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

హన్మకొండ కల్చరల్ / హన్మకొండ: హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో శనివారం సంప్రదాయ దినోత్సవాన్ని నిర్వహించారు. వాగ్దేవి కళాశాల ఫార్మ్‌డీ ప్రిన్సిపాల్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ ఎస్‌వీఎన్ శర్మ, వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేషాచలం, ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ రెడ్డి, ఎంబీఏ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫార్మసీ సంప్రదాయ రంగైన ఆకుపచ్చ వర్ణం దుస్తులను ధరించి కళాశాలలో ఏర్పాటు చేసిన వనశంకరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎస్‌వీఎన్ శర్మ.. గ్రీన్ ఫార్మసీ ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్.దేవేందర్ రెడ్డి, డైరెక్టర్ వాణిదేవి, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ వాహినీదేవి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఓడీ డాక్టర్ శరవణభవ, డాక్టర్లు శ్రవణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, రజనీ పాల్గొన్నారు.